సాక్షి
హైదరాబాద్‌ । శనివారం । 5 । అక్టోబర్‌ । 2024



నవ దుర్గ.. నృత్యరూపకం

మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు, ఫోక్‌ ఫెస్టివల్‌, చేనేత ఎగ్జిబిషన్‌లు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. శిల్పారామంకు వచ్చిన సందర్శకులు పలు రకాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఇందులో గద్వాల్‌, పోచంపల్లి, కోట, కాశ్మీరిసిల్క్‌, జాంధానీ, మస్లిన్‌, బెంగాలీ కాటన్‌ తదితర ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఫోక్‌ ఆర్ట్‌ ఫెస్టివల్‌ ముగింపు కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ, చెక్క భజన, లంబాడి నృత్యం, నల్లమోలు లక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో నవ దుర్గ స్తోత్రం నృత్య రూపకంతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామం సిబ్బంది, సందర్శకులతో కలసి బతుకమ్మ ఆడారు.



నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్‌: వేమన కాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు.
- సురక్ష ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు విద్యానగర్‌, సురక్ష కాలనీ, రాజేందర్‌రెడ్డినగర్‌, శుభోదయ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్‌, అపర్ణహిల్‌ పార్కు ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- భిక్షపతి ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు భిక్షపతి కాలనీ, జవహర్‌ కాలనీ రోడ్డు నంబర్‌ 4,5,6, శ్రీదేవి థియేటర్‌ ఏరియాలలో..
- ఫ్రెండ్స్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఫ్రెండ్స్‌ కాలనీ, అర్జున్‌ రెడ్డి కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్‌ ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు.

స్కిన్‌వి బయోసైన్సెస్‌ -యూకే మైక్రోబిరా లిమిటెడ్‌ ఎంఓయూ



ఒప్పందం చేసుకున్న ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలోని స్టార్టప్‌ స్కిన్‌వి బయోసైన్సెస్‌ సంస్థ, యూకేలోని మైక్రోబిరా లిమిటెడ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. యాంటీ మైక్రోబయల్‌ రెసిస్టెన్స్‌(ఏఎంఆర్‌)ను ఎదుర్కోవడానికి పని చేస్తాయి. స్కిన్‌వి బయోసైన్సెస్‌, మైక్రోబిరా లిమిటెడ్‌ మధ్య జాయింట్‌ వెంచర్‌ ఏఎంఆర్‌కి వ్యతిరేకంగా పోరాటంలో ఒక అద్భుతమైన ముందడగు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కిన్‌వి బయోసైన్సెస్‌ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌ డాక్టర్‌ పి రత్నాకర్‌, మైక్రోబిరా లిమిటెడ్‌ సీఈఓ మరియాన్‌ ఇస్మాయిల్‌, ఎస్పైర్‌ బయోనెస్ట్‌ వ్యవస్థాపక డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ రెడ్డన్న ప్రసంగించారు.

స్నో కింగ్‌డమ్‌లో దాండియా

గచ్చిబౌలి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా.. స్నో కింగ్‌ డమ్‌లో దాండియా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఎండీ పువ్వాడి హరిత తెలిపారు. శుక్రవారం కొత్తగూడలోని శరత్‌ సిటీ క్యాపిటల్‌ మాల్‌లోని కింగ్‌డమ్‌లో పలువురు మోడళ్లు దాండియా ఆడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచు ప్యాలెస్‌లు, మంచు పర్వతాలు, బ్లాక్‌ సీల్స్‌, ఓక్‌ చెట్లు, ఇగ్లూలు, ధృవపు ఎలుగు బంట్ల బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటాయని తెలిపారు. గుజరాతి, రాజస్థానీ సంస్కృతి ప్రతిబింబించే రీతిలో మంచులో 9 రోజుల పాటు దాండియాను నిర్వహిస్తున్నామని, పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.650 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు.



ఫ్రీ లెఫ్ట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాదాపూర్‌లో విస్తరించనున్న రోడ్డును పరిశీలిస్తున్న అధికారుల బృందం

గచ్చిబౌలి: రహదారుల విస్తరణలో ఫ్రీ లెఫ్ట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని సైబరాబాద్‌ ట్రాఫిక్‌ జాయింట్‌ సీపీ జోయల్‌ డెవిస్‌ ఆయా విభాగాల అధికారులకు సూచించారు. ఐటీ కారిడార్‌లో చేపడుతున్న రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌ల విస్తరణను ఆయా విభాగాల అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.సైబర్‌ టవర్‌ ఫ్లై ఓవర్‌ నుంచి యశోద ఆస్పత్రి వరకు జరుగుతున్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ ఎండీ అశోక్‌, వెస్ట్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌ రెడ్డి, డీసీ మోహన్‌రెడ్డి, ఈఈలు రాజు, డీఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో బాలాత్రిపురసుందరిగా రాజరాజేశ్వరీదేవి



శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి..



నానక్‌రాంగూడ పూజారిబస్తీలో..



రాయదుర్గంలో..

కుంకుమార్చన.. చండీహోమాలు

నిత్యపూజలందుకుంటున్న అమ్మవారు
భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

రాయదుర్గం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు, పారాయణం నిర్వహించారు.
- జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో రాజరాజేశ్వరీమాత బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. నవ చండీపారాయణం, మండప పూజ, చండీ హోమం కార్యక్రమాలను నిర్వహించారు.
- రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నానక్‌రాం గూడలోని భాగ్యలక్ష్మీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు.

నేటి అలంకారం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో శనివారం.. జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌ ఆలయంలో రాజరాజేశ్వరీమాతను గాయత్రీదేవిగా అలంకరిస్తారు
- రాయదుర్గంలోని ఊరపోచమ్మ అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించనున్నారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా..



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో చండీహోమం, పూజల్లో పాల్గొన్న భక్తులు



రాయదుర్గంలో..గాయత్రీ దేవిగా ఊర పోచమ్మ



ఊరపోచమ్మ ఆలయంలో.. భక్తులు



రాయదుర్గంలో.. మండపం వద్ద కుంకుమ పూజ

గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ బదిలీ

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ ఎస్‌.ఆంజనేయులును ఈఓడబ్ల్యూకు బదిలీ చేస్తూ సైబరాబాద్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ మహ్మద్‌ అబుబుల్లా ఖాన్‌ను గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. గచ్చిబౌలి డీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. మాదాపూర్‌ ట్రాఫిక్‌ ఎస్‌హెచ్‌ఓ కె.నర్సయ్యను షాద్‌నగర్‌ రూరల్‌ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. షాద్‌నగర్‌ ఎస్‌హెచ్‌ఓ బి.సత్యనారాయణను మాదాపూర్‌ ట్రాఫిక్‌ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

గుంతల రోడ్డు.. ఇబ్బందులు

పటాన్‌చెరు: గుంతల రోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా మారిందని మాదారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామ శివారులో గుంతలు పడ్డ రోడ్డును మాజీ సర్పంచ్‌ సురేందర్‌ గౌడ్‌ పరిశీలించారు. రోడ్డును బాగుచేయాలని ఆర్‌ అండ్‌ బి అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాగా రాత్రి సమయాల్లో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

సభ్యత్వ నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్‌ కాలనీలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

‘సద్దుల బతుకమ్మ’ ఏర్పాట్ల పరిశీలన



సాకి చెరువును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: సద్దుల బతుకమ్మ పర్వదినంను పురస్కరించుకొని..ఈ నెల 10వ తేదీ పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని సాకి చెరువు కట్టపై నిర్వహించబోయే బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, ఏఎంసీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ఇబ్బందులు రానివ్వం



చెరువు కట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శివమ్మ కాలనీ, అంబీర్‌ చెరువు కట్ట మీద స్థలాన్ని జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్‌, అనిల్‌రెడ్డి, శివరాజ్‌ గౌడ్‌ ,జీహెచ్‌యంసీ అధికారులు ఎస్‌ఆర్‌పి నాయక్‌, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, ఎంటమాలజి సూపర్‌వైజర్‌ డి. నరసింహులు, వాటర్‌వర్క్స్‌ సూపర్‌వైజర్‌ శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని ‘ఆఖరి మజిలీ’



శేరిలింగంపల్లి: ఆఖరి మజిలీ సౌకర్యవంతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ నగరంలో శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా శేరిలింగంపల్లిలో గోపన్‌పల్లి, ఖాజాగూడలోని శ్మశానవాటికలను మినీ మహాప్రస్థానాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. అదే విధంగా ఖాజాగూడలో ఏడాది క్రితం మూడు కోట్లతో మినీ మహాప్రస్థానం తరహాలో అభివృద్ధి చేయాలని శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాని విషయం తెలిసిందే. కాగా శేరిలింగంపల్లిలో అత్యధిక కాలనీలు, బస్తీవాసులు వినియోగించే శ్మశానవాటిక కావడంతో దీన్ని మరింత అభివృద్ధి చేయాలనే డిమాండ్‌ పెరుగుతోంది. లింగంపల్లి, పాపిరెడ్డి కాలనీ, సురభికాలనీ, రాజీవ్‌ గృహకల్ప, రాజీవ్‌ ఆరంభ టౌన్‌ షిప్‌, నెహ్రూనగర్‌, గోపీనగర్‌, డోయన్స్‌ కాలనీ, నల్లగండ్ల, ఆదర్శనగర్‌, భెల్‌ ఎంఐజీ కాలనీ, హుడా ట్రేడ్‌ సెంటర్‌ కాలనీ, రైల్‌విహార్‌, గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్‌, డోయన్స్‌ కాలనీ, డాక్టర్స్‌ కాలనీ, నల్లగండ్ల హుడా కాలనీ తదితర కాలనీలు, బస్తీలకు చెందిన వేలాది కుటుంబాలకు ఇదే అందుబాటులో ఉండే అతిపెద్ద శ్మశానవాటిక. ఈ క్రమంలో మినీ మహాప్రస్థానంగా చేయాలనే వినతులు వస్తున్నాయి. కాగా ఈ శ్మశానవాటికలో విద్యుత్‌ దహనవాటిక, గ్రీనరీని ఏర్పాటు చేయాలి.

శంకుస్థాపనతోనే సరి..





శేరిలింగంపల్లి శ్మశాన వాటిక

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి



పెద్దఎత్తున కాలనీలు, బస్తీలు వినియోగించే శ్మశానవాటిక కావడంతో మంచి వాతావరణం నెలకొనేలా చూడాలి. ఆధునికీకరణకు అవసరమైన నిధులను కేటాయించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. నిధులు మంజూరు చేయించి మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరాన్ని గుర్తించాలి. – శ్రీనివాసరావు, సురభి కాలనీ

మినీ మహాప్రస్థానంలా అభివృద్ధి చేయాలి



శేరిలింగంపల్లిలో అత్యధిక కాలనీలు, బస్తీలు వినియోగించే శ్మశానవాటిక ఇది. ఈ నేపథ్యంలో దీన్ని మినీ మహాప్రస్థానంలా అభివృద్ధి చేయాలి. ఆ దిశగా ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తే నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.
– టీ.రామస్వామి యాదవ్‌, మున్సిపల్‌ మాజీ ఫ్లోర్‌లీడర్‌

వీడిన స్పందన హత్యకేసు మిస్టరీ

స్నేహితుడే అంతమొందించాడు
- బండరాయితో తలపై మోది హత్య
- నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించిన మియాపూర్‌ పోలీసులు



నిందితుడు మనోజ్‌ కుమార్‌

మియాపూర్‌: వివాహిత హత్యకేసు మిస్టరీ వీడింది. తన ప్రేమను అంగీకరించకపోవడం, ఇతరులతో సన్నిహితంగా ఉండడం జీర్ణించుకోలేక ఆమె స్నేహితుడే బండరాయితో మోది స్క్రూడ్రైవర్‌తో విచక్షణంగారహితంగా పొడిచి హత్యచేశాడు. అతడిని మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.సీఐ దుర్గా రామలింగప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి సుదర్శన్‌నగర్‌కు సమీపంలోని ఆర్‌ఎంఓయూ కాలనీలోని గ్రీన్‌ అవెన్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసముండే మందల మనోజ్‌ కుమార్‌ అలియాస్‌ బాలు(29) ప్రైవేటు ఉద్యోగి. దీప్తీశ్రీనగర్‌ కాలనీలోని సీబీఆర్‌ ఎస్టేట్‌లో నివాసముండే స్పందన (29) 2017లో ఒకే కళాశాలలో ఇంటర్‌ చదివారు. దీప్తీశ్రీనగర్‌కు చెందిన వినయ్‌కుమార్‌ కూడా వారితో పాటు చదివాడు. కాగా స్పందన వినయ్‌కుమార్‌లు ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో 2022లో వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత కొద్దిరోజులకే భార్య, భర్తల మధ్య మనస్పర్ధల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. స్పందన తన తల్లి నమ్రత దగ్గర దీప్తీశ్రీనగర్‌ సీబీఆర్‌ ఎస్టేట్‌ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటుంది.

తన ప్రేమ అంగీకరించలేదని హత్య

భర్తతో విబేధాల కారణంగా ఒంటరిగా ఉంటున్న స్పందనకు మనోజ్‌కుమార్‌ దగ్గరయ్యాడు. అప్పుడప్పుడు ఇంటికి వస్తూ వెళ్తుండేవాడు. ఈ క్రమంలో మనోజ్‌ ప్రేమిస్తున్నానని స్పందనకు ప్రపోజ్‌ చేశాడు. ఆమె తిరస్కరించి స్నేహితుడిగా ఉండాలని మందలించింది. స్పందన తన ప్రేమను తిరస్కరించడంతో పాటు ఇతర స్నేహితులతో సన్నిహితంగా ఉండడం చూసిన మనోజ్‌ జీర్ణించుకోలేకపోయాడు. ఎలాగైనా స్పందనను చంపేయాలని అనుకున్నాడు.ఈ క్రమంలోనే స్పందన తల్లి నమ్రత ఇంట్లోలేని సమయం చూసి పథకం ప్రకారం వచ్చి ఇంట్లో పడుకున్న స్పందన తలపై బండరాయితో మోదాడు. అనంతరం స్క్రూడ్రైవర్‌తో ముఖంపై విచక్షణంగా రహితంగా పొడిచి దారుణంగా హత్య చేశాడు. అనంతరం బయట నుండి తాళం వేసి వెళ్లిపోయాడు. సాయంత్రం స్పందన తల్లి నమ్రత ఇంటికి వచ్చి చూసేసరికి స్పందన బెడ్‌పై రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉంది. మృతురాలి తల్లి నమ్రత మియాపూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. అపార్ట్‌మెంట్‌, కాలనీలో సీసీ కెమెరాలు, మృతురాలి ఫోన్‌ సీడీఆర్‌ డేటా ఆధారంగా స్పందనను హత్య చేసింది స్నేహితుడు మనోజ్‌ అని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా స్పందనను హత్య చేసింది తానేనని ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు హెచ్‌సీయూ డిపో మేనేజర్‌ ఎం మురళీధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను ఈనెల 12వ తేదీ వరకు నడుపుతామన్నారు. లింగంపల్లి నుంచి ఎంజీబీఎస్‌ వరకు, గచ్చిబౌలి నుంచి మహబూబ్‌నగర్‌ వైపు, లింగంపల్లి నుంచి జహీరాబాద్‌ వైపు బస్సులు ఉంటాయని వివరించారు. వివరాల కోసం హెచ్‌సీయూ ఏఎం(టి) రవికుమార్‌ను ఫోన్‌ నంబర్‌ 7382814235లో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం

ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌ ప్రాజెక్ట్‌ అడ్వైజరీ బోర్డుకు ప్రొ.ప్రమోద్‌ కె నాయర్‌



రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం లభించింది. హెచ్‌సీయూ ప్రొ. ప్రమోద్‌ కె నాయర్‌ ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌ ప్రాజెక్ట్‌ అడ్వైజరీ బోర్డుకు నామినేట్‌ అయ్యారు. ఆక్స్‌ఫర్డ్‌ యూనివర్సిటీ ప్రెస్‌(ఓయూపీ) నుంచి ఆక్స్‌ఫర్డ్‌ ఇంటర్‌సెక్షన్స్‌ అని పిలువబడే ఇంటర్‌ డిసిప్లినరీ అకడమిక్‌ పబ్లిషింగ్‌ ఇనీషియేటివ్‌ అడ్వైజరీ బోర్డులో చేరడానికి హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ హ్యూమానిటీస్‌లోని స్కూల్‌ ఆఫ్‌ ఇంగ్లిష్‌ విభాగంలో సీనియర్‌ ప్రొఫెసర్‌ ప్రమోద్‌ కె నాయర్‌ను నామినేట్‌ చేశారు.ఓయూపీ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద యూనివర్సిటీ ప్రెస్‌. ప్రపంచంలో పరిశోధక ,సాహిత్య, అధ్యయన రంగంలో భారత్‌ నుంచి పరిశోధకుడుగా గుర్తింపు పొందారు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ప్రతిరోజూ ‘సాయి సచ్చరిత్ర’ పఠనం

రాయదుర్గం: విజయదశమి సందర్భంగా టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో రోజూ ‘సాయి సచ్చరిత్ర పఠనం ’ ఉంటుందని ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మంజీరా పైప్‌లైన్‌ నూతన రోడ్డు పనులకు శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. మంజీరా పైప్‌లైన్‌ లీకేజీలతో రోడ్డంతా గుంతలు పడిందన్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో గత సంవత్సరం రూ.40 కోట్లతో నూతన పైప్‌లైన్‌ పనులు ప్రారంభించామన్నారు. పైప్‌లైన్‌ పూర్తి అయినందున నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.4.31 కోట్ల నిధులతో చేపడుతున్నామన్నారు. హఫీజ్‌పేట్‌ ఫ్లైఓవర్‌ నుంచి విజేత సూపర్‌ మార్కెట్‌ వరకు రూ.1.97 కోట్లు, విజేత సూపర్‌ మార్కెట్‌ నుంచి మై హోమ్‌ జువెల్‌ వరకు రూ.1.95 కోట్లు, ఆర్టీసీ కాలనీ నుంచి మురళీధర్‌ సొసైటీ వరకు రూ.39.50 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టనున్నామన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ రోజాదేవి, అధికారులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఏఎస్‌ రాజు కాలనీలోని ఓ అపార్టుమెంట్‌లోకి మురుగునీరు వస్తున్నదని కాలనీ అసోసియేషన్‌ సభ్యులు కార్పొరేటర్‌ రోజాదేవి దృష్టికి తీసుకురాగా శుక్రవారం ఆమె అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎర్రవెల్లి సతీష్‌రావు, సెక్రటరీ పిఎస్‌ రాజు, నరసింహనాయుడు, కిషోర్‌, సభ్యులు పాల్గొన్నారు

హైదర్‌నగర్‌ డివిజన్‌ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌యంటి హిల్స్‌, రాంనరేష్‌ నగర్‌ కాలనీలో 75 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ నార్నె శ్రీనివాసరావు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత



సామగ్రిని అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్‌

శేరిలింగంపల్లి: హోప్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌కు వంట సామాగ్రిని శుక్రవారం అందజేశారు. ఫౌండేషన్‌ ఛైర్మన్‌ కొండ విజయ్‌కుమార్‌ సామగ్రిని వైద్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ మాట్లాడుతూ త్వరలో వాటర్‌ కూలర్‌ను ఇస్తానన్నారు. లయన్స్‌ క్లబ్‌ హోప్‌ అధ్యక్షులు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, హెల్త్‌ సెంటర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అన్నపూర్ణ, ఉద్యోగులు శ్యామల, పాండు పాల్గొన్నారు.

8 భవనాలకు నోటీసులు జారీ

ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్‌

పటాన్‌చెరు టౌన్‌: గ్రామ పంచాయతీ నుండి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్‌ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఎనిమిది భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవలే నాలుగు అక్రమ నిర్మాణాలు గుర్తించి, కూల్చివేసినట్లు తెలిపారు.